నకిలీ మద్యంపై నిరసన గళం

- బెల్టుషాపులను తొలగించాలని డిమాండ్
- తిరువూరు, మైలవరం, నూజివీడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రదర్శన, ధర్నా
- ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రాలు అందజేత

తిరువూరు: ప్రజల ప్రాణాలు హరించే నకిలీ మద్యాన్ని అరికట్టడంలో ప్రభుత్వం ఉదాసీనవైఖరి అవలంభిస్తోందని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ పరిశీలకుడు తంగిరాల రామిరెడ్డి ఆరోపించారు. సోమవారం తిరువూరులో నకిలీ మద్యాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వ వైఖరికి నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రదర్శన అనంతరం ధర్నా నిర్వహించారు. ఏమీ తెలియనట్లు కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని, నకిలీ మద్యం తయారీ దారులు అధికారపార్టీ నేతలే కావడంతో కేసును నీరుగార్చేందుకు ఉన్నత స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారని రామిరెడ్డి ధ్వజమెత్తారు. నియోజకవర్గ మహిళా విభాగ అధ్యక్షురాలు పీ సుధారాణి మాట్లాడుతూ దేవాలయాలు, పాఠశాలల సమీపంలో, నివాసగృహాల నడుమ నిర్వహించే అక్రమ మద్యం దుకాణాలు తొలగించాలని, లైసెన్స్‌డ్ దుకాణాలను ఊరికి దూరంగా తరలించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయం నుంచి మహిళలు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రదర్శన జరిపి ఫ్యాక్టరీ సెంటర్‌లోని ఎక్సైజ్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నిక్సన్‌కు మెమోరాండం సమర్పించారు.



తిరువూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు


తిరువూరులో వర్షాన్ని కూడా లెక్కచేయకుండా వైఎస్సార్ సీపీ శ్రేణుల ర్యాలీ

పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినా..

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఆందోళనా కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వచ్చిన మహిళలను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినా ఫలించలేదు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ కార్యదర్శి నరెడ్ల వీరారెడ్డి, తిరువూరు పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, తాళ్ళూరి నవీన్‌కుమార్, గంపలగూడెం, విస్సన్నపేట, ఏకొండూరు జెడ్పీటీసీ సభ్యులు గద్దల శామ్యూల్, బీమిరెడ్డి లోకేశ్వర రెడ్డి, భూక్యా గన్యా, తిరువూరు నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, తంగిరాల వెంకటరెడ్డి, మోదుగు ప్రసాద్, ఇనపనూరి చిన్నారి, గుమ్మా వెంకటేశ్వరి, వెలుగోటి విజయలక్ష్మి, ఏరువ ప్రకాష్‌రెడ్డి, ఏకొండూరు ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, పార్టీ నాయకులు దుర్గారావు, శిరసాని ప్రకాష్, నెక్కళపు కుటుంబరావు, షేక్ జాకీర్, తిరుమలశెట్టి వేణు, భూక్యా రాణి, బీ రాము, శ్రీనివాసరెడ్డి, కాలసాని గోపాలనాగేశ్వరరావు, కలకొండ రవికుమార్, ఆలపాటి ఉమామహేశ్వరరావు, మందపాటి ఉమామహేశ్వరరెడ్డి, కుంచం విజయలక్ష్మి, కాలసాని విజయలక్ష్మి, కాలసాని చెన్నారావు, మామిడి కుటుంబరావు, యరదేశి రామారావు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోని ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీ ప్రతాప్ అప్పారావు


ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్యకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎంవీ ప్రతాప్ అప్పారావు, నాయకులు

నూజివీడు: కూటమి ప్రభుత్వం పాలనలో రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారుతోందని, కల్తీ మద్యం మాఫియా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ధ్వజమెత్తారు. కల్తీ మద్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు పట్టణంలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు, నాయకులు సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మేకా ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ నకిలీ మద్యం వ్యవహారంపై సీఎం చంద్రబాబు తక్షణం సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. రైతులకు సరఫరా చేయాల్సిన యూరియాపై కంటే ప్రజల ప్రాణాలను హరించేస్తున్న మద్యం సరఫరాపైనే కూటమి ప్రభుత్వానికి ఎక్కువ ఆసక్తి ఉందన్నారు. యూరియా వాడితే క్యాన్సర్ వస్తుందని చెప్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మద్యం తాగితే ఆరోగ్యం మెరుగవుతుందా? అని ప్రతాప్ ప్రశ్నించారు. టీడీపీ నాయకులు తయారు చేసి రాష్ట్రంలోని గ్రామాలపైకి వదులుతున్న నకిలీ మద్యం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతిని మంచాన పడుతున్నారన్నారు. ప్రతి మద్యం సీసాకు ఎమ్మార్పీపై రూ.20 నుంచి రూ.30 అధికంగా విక్రయిస్తున్నా ఈ ప్రభుత్వానికి కనబడటం లేదా? అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మద్యం దుకాణాలను ప్రభుత్వమే నడిపిందని, వేలాది ఉద్యోగాలు సృష్టించి యువతకు ఉపాధిని చూపించిందన్నారు. అనంతరం ఎక్సైజ్ సీఐ ఏ మస్తానయ్యకు ప్రతాప్ అప్పారావు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నూజివీడు పట్టణ, ముసునూరు మండలాల అధ్యక్షులు శీలం రాము, మూల్పూరి నాగవల్లేశ్వరరావు, కృష్ణాజిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, ముసునూరు ఎంపీపీ కొండా దుర్గాభవాని, ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి కంచర్ల లవకుమార్, క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఈలప్రోలు వెంకట సుబ్బయ్య, నాయకులు పల్లె రవీంద్రరెడ్డి, షేక్ యూనస్‌పాషా, బసవా వినయ్, కవులూరు యోగి, మలిశెట్టి బాబీ, కాలి సుగుణరావు, కళ్లేపల్లి ఆదినారాయణ, షేక్ మస్తాన్, కంబాల రాంబాబు, పాముల రాణి, పెదగర్ల స్వరూపరాణి, అత్తి మురళీ తదితరులు పాల్గొన్నారు.

నారావారి సారా పాలనకు చరమగీతం పాడుదాం

వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్


ఎక్సైజ్‌శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న జోగి రమేష్, పార్టీ శ్రేణులు

జి.కొండూరు: కుటీర పరిశ్రమల్లా నకిలీ మద్యం కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన చంద్రబాబు ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ అన్నా రు. వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు జోగి రమేష్ ఆధ్వర్యంలో మైలవరం ఎక్సైజ్‌శాఖ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన సోమవారం నిర్వహించారు. జోరువానలోనూ నిరసన కార్యక్రమానికి పార్టీ శ్రేణు లు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. నకిలీ మద్యం తయారీలో నిజమైన నిందితులకు శిక్ష పడాలంటూ నినాదాలు చేశారు. మద్యం సీసాలను తీసుకొచ్చి మద్యం పారబోసి నిరసన తెలిపారు. ఎక్సైజ్ సీఐ జె.శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. జోగి రమేష్ మాట్లాడుతూ


మైలవరం ఎక్సైజ్ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులతో జోగి రమేష్

చంద్రబాబు పాలనలో టీడీపీ నాయకుల నకిలీ మద్యం కేంద్రాల్లో తయారైన నకిలీ మద్యాన్ని ప్రైవేటు మద్యం షాపులు, బెల్టు షాపుల్లో, బార్‌లతో పాటు ఇళ్లకు సైతం డోర్ డెలివరీ చేశారన్నారు. తాగేందుకు గుక్కెడు నీళ్లివ్వమంటే ఇవ్వలేని సిగ్గుమాలిన కూటమి ప్రభుత్వం, నకిలీ మద్యంను సరఫరా చేసి పేద ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పి చేశారని మండిపడ్డారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా సిట్ పేరుతో చంద్రబాబు మరో నాటకానికి తెరలేపారన్నారు. పోలీసుల అదుపులో ఉన్న నింధితులపై ఒత్తిడి తెచ్చి నకిలీ మద్యం కుంభకోణం మకిలిని ప్రతిపక్ష పార్టీకి అంటించేందుకు ఈ ప్రభుత్వం వినూత్న ప్రయత్నాలు చేస్తుందన్నారు.చంద్రబాబునాయుడుకి నిజంగా దమ్ముంటే సీబీఐ విచారణ జరిపించి నిజమైన నింధితులకు శిక్షపడేలా చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. తనపై ఆరోపణలు చేస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ బాగోతం మైలవరం నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునన్నారు. నియోజకవర్గంలో ఇంత పెద్ద ఎత్తున నకిలీ మద్యం తయారవుతుంటే ఎమ్మెల్యే ఎక్కడ నిద్రపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు సర్నాల తిరుపతిరావు, అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, వేములకొండ తిరుపతిరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పామర్తి శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు గరికపాటి శ్రీదేవి, పార్టీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు గోగులమూడి రాణి, సీనియర్ నాయకులు అప్పిడి సత్యనారాయణరెడ్డి, మైలవరం పట్టణ అధ్యక్షుడు పాల నారాయణరెడ్డి, పార్టీ జి.కొండూరు, మైలవరం, ఇబ్రహీంపట్నం, విజయవాడరూరల్ మండలాల అధ్యక్షులు జడ రాంబాబు, గొర్నెపూడి వెంకట్రావు, రెంటపల్లి నాగరాజు, బయ్యారపు రవికిశోర్, వివిధ విభాగాల కన్వీనర్‌లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శనకు తరలివెళ్లిన మహిళలు


తిరువూరులో నిరసన తెలిపేందుకు తరలివెళుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, మహిళలు

విస్సన్నపేట: కల్తీ మద్యం కు నిరసన తెలిపేందుకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం విస్సన్నపేట నుంచి మహిళలు తిరువూరు తరలి వెళ్లారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా మహిళలు స్వచ్ఛందంగా నిరసన తెలిపేందుకు వెళ్లారు. జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఓలేటి దుర్గారావు, పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, సీనియర్ నాయకుడు సిరసాని ప్రకాష్, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ భూక్యా రాణి, మైనార్టీ నాయకుడు దస్తగిరి, మేకల రవి, కార్యకర్తలు తదితరులు తరలివెళ్లినవారిలో ఉన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడిని ఖండించిన అవినాష్

తిరువూరు: గంపలగూడెం మండలం సొబ్బాలలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తల దాడి గర్హనీయమని పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలుపుతూ తోరణాలు కట్టిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కర్రలతో దాడికి పాల్పడటం హేయమైన చర్యన్నారు. గాయపరచిన టీడీపీ కార్యకర్తలపై పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాధితులను ఫోనులో పరామర్శించిన అవినాష్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లపై ఆర్డీవో సమీక్ష



తిరువూరు: ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మిల్లర్లు జాగ్రత్తలు తీసుకోవాలని తిరువూరు ఆర్డీవో కే మాధురి ఆదేశించారు. సోమవారం తిరువూరు ఆర్డీవో కార్యాలయంలో పౌరసరఫరాల అధికారులు, సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల సిబ్బందితో, రైస్ మిల్లుల యజమానులతో ధాన్యం కొనుగోలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తేమ కొలిచే యంత్రాలను, గోనె సంచులను కొనుగోలు కేంద్రాల వద్ద సిద్ధంగా ఉంచాలని, ముందుగా వచ్చిన రైతులకు ముందు గన్నీ బ్యాగులు ఇవ్వాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో అలసత్వం వహించేవారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఏకొండూరు, రెడ్డిగూడెం మండలాల తహసీల్దార్లు, వ్యవసాయాధికారులు, పీడీఎస్ అధికారులు, సహకార సంఘాల కార్యదర్శులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు భిక్ష

చాట్రాయి: మండలంలోని చీపురుగూడెం గ్రామంలో అయ్యప్ప దీక్ష తీసుకున్న సుమారు 50 మంది అయ్యప్ప భక్తులకు గ్రామానికి చెందిన చీకటి శ్రీనివాసరావు సహకారంతో భిక్షను ఏర్పాటు చేశారు. దీక్షలో ఉన్న 41 రోజులు పాటు అయ్యప్ప మాలధారులకు భిక్ష అందిస్తామని దాతలు తెలిపారు. మండలంలోని సోమవరం అయ్యప్ప స్వామి ఆలయంలో దీక్ష చేపట్టిన అయ్యప్ప మాలధారులకు దాతలు భిక్ష ఏర్పాటు చేస్తున్నారు.

గర్భిణులకు పోషకాహారంపై అవగాహన ఉండాలి



ఇబ్రహీంపట్నం: గర్భిణులు, బాలింతలు పోషకాహారంపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీసీ మైలవరం ప్రాజెక్ట్ సీడీపీఓ కే.పుష్పలత తెలిపారు. ఇబ్రహీంపట్నం కమ్యూనిటీ హాల్‌లో 8వ రాష్ట్రీయ పోషకాహార మాసోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహార జాగ్రత్తలను సీడీపీఓ పుష్పలత తెలియజేశారు. విజయవాహిని చారిటబుల్ ట్రస్ట్ ప్రోగ్రాం అసోసియేట్ చెన్ను దివ్యశ్రీ పోషకాహార ప్రాముఖ్యత, వెయ్యి రోజుల సంరక్షణ గురించి వివరించారు. కౌన్సిలర్ దేవకుమారి మాట్లాడారు. పోషకాహారం తయారీపై వంటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సూపర్‌వైజర్‌లు మాధవి, శివకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుక్కల బెడద నుంచి కాపాడాలి

తాతకుంట్ల(విస్సన్నపేట): మండలంలోని తాతకుంట్ల గ్రామంలో కుక్కల బారి నుంచి ప్రజలను కాపాడాలని కోరుతూ సీపీఎం నాయకులు స్థానిక గ్రామ సచివాలయం సెక్రటరీ పగడాల శ్రీనివాసరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ తాతకుంట్ల గ్రామ పంచాయతీ పరిధిలో కుక్కలు చిన్నపిల్లలు, మహిళలు, ఒంటరిగా నడిచి వెళ్లేవారిపై దాడి చేస్తున్నాయని, సంబంధిత అధికారులు వెంటనే కుక్కలను పట్టించి దూరప్రాంతాలకు తరలించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

ప్రణాళికా బద్ధంగా చదవాలి



పెనుగంచిప్రోలు: విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివి పరీక్షలకు సిద్ధం కావాలని ఎంఈఓ డి.రవీంద్ర అన్నారు. సోమవారం స్థానిక ఎస్ఎస్పైపీఎం జెడ్పీ బాలికల హైస్కూల్‌లో జరుగుతున్న ఫార్మేటివ్- 2 పరీక్షలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సామర్థ్యాలతో మూల్యాంకనం కోసం ప్రత్యేకంగా మూల్యాంకన పుస్తకాలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నక్కా బాబూరావు, ఉపాధ్యాయులు ముక్కా సత్యనారాయణ, స్వాతిశిల్ప, వేగినేటి రమణ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై పోరుబాట

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కౌలు రైతులకు వ్యతిరేకంగా తీసుకున్న విధానాలపై పోరుబాటకు ఇప్పటికే కార్యాచరణ రూపొందించినట్లు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు తెలిపారు. రెండు రోజులుగా కొండపల్లి బీకాలనీలో జరిగిన సీఐటీయూ 12వ జిల్లా మహాసభలు సోమవారంతో ముగిశాయి. జిల్లాలోని సీఐటీయూ ప్రతినిధులు, కార్మిక సంఘాల ప్రతినిధులు మహాసభకు హాజరయ్యారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మహాసభలు నిర్వహిస్తామన్నారు. ఈయేడాది డిసెంబర్ 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు తదితరులు

జరిగే అఖిల భారత మహాసభలు విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీవీ కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారుతుందని వెల్లడించారు. తాగునీరు ఇవ్వలేని ప్రభుత్వం మద్యాన్ని ఇంటింటికి డెలివరీ చేస్తుందన్నారు. మహాసభలో 48మందితో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. పీవీ ఆంజనేయులు, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, కమల, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచడం సామాజిక బాధ్యత

మక్కపేట(వత్సవాయి): మొక్కలను విరివిగా పెంచితే కాలుష్యం దరిచేరదని, మొక్కలు నాటడాన్ని అందరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వి.ప్రసూన, కేవీకే శాస్త్రవేత్త ఆర్.ప్రభావతి సూచించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ సామాజిక విజ్ఞాన కళాశాలకు చెందిన విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మక్కపేటలో వంద మొక్కలు నాటారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు గ్రామంలో ముఖ్యమైన ప్రదేశాలలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణ బాధ్యతలను అందరూ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

సీజేపై దాడికి యత్నించిన వ్యక్తిని దేశ బహిష్కరణ చేయాలి

నందిగామ టౌన్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడికి యత్నించిన న్యాయవాది రాకేష్ కిషోర్‌కు దేశ బహిష్కరణ విధించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజ్ పేర్కొన్నారు. నందిగామ న్యాయ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో స్థానిక గాంధీ సెంటరులో సోమవారం సీజేపై జరిగిన దాడి యత్నాన్ని ఖండిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దాడికి యత్నించిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి రాజ్యాంగంపై, న్యాయ వ్యవస్థపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఇటువంటి చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సమత క్లబ్ జిల్లా గవర్నర్ కేజడ్ఎస్ కుమార్, మసీదు ముతావలి షేక్ ఖాజా, జాషువా పొండేషన్ ప్రతినిధి కోట రవీంద్రనాథ్, వామపక్ష నాయకులు చుండూరు సుబ్బారావు, సయ్యద్ ఖాశీం, న్యాయవాదులు కన్నెకంటి జీవరత్నం, బాబు విద్యాసాగర్, కోట దేవదాసు, నంద్రు శ్రీరామ్మూర్తి, అద్దంకి మణిబాబు, మిక్కీ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి సుందర్, బర్రె ఉదయ్‌కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయవాదులు

అర్జీలను సకాలంలో పరిష్కరించండి

సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న

నూజివీడు: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు సకాలంలో పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం సబ్‌కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించి వాటిని పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపారు. ప్రజల వద్ద నుంచి 20 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పంపారు. ఎఫ్ఆర్ఓ సత్యనారాయణ, కోపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగలక్ష్మి, సీడీపీఓ పిల్లి విజయలక్ష్మి, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు కొన్ని..

- చింతలపూడి మండలం తీగలవంచలో ఆర్ఎస్ నంబరు 360-3లో 1-52 ఎకరాల భూమి ఉందని, పక్కన ఉన్న వారు తనను భూమిలోకి రానివ్వకుండా దౌర్జన్యంగా తన భూమిని ఆక్రమించుకుని అనుభవిస్తున్నారని, న్యాయం చేయాలని కోరుతూ అదే గ్రామానికి చెందిన నర్సుల లక్ష్మి అర్జీని అందజేశారు.
- చాట్రాయిలో సర్వే నంబరు 218/1బిలో 1.08 ఎకరాల భూమికి పట్టాదారు పాసు పుస్తకం ఉందని, అయితే రెవెన్యూ రికార్డులో తన భూమిని 22ఏ జాబితాలో చేర్చారని, దానిలో నుంచి తొలగించాలని కోరుతూ చాట్రాయికి చెందిన గోలి కృష్ణారెడ్డి అర్జీని అందజేశారు.
- నూజివీడులోని ఏరియా ఆసుపత్రి వద్ద ప్రైవేటు అంబులెన్స్‌ల దందా వల్ల పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అర్జెంటు వైద్యం కోసం ఎవరైనా వస్తే వేలాది రూపాయలు డిమాండ్ చేస్తూ పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, ప్రభుత్వ అధికారులే విజయవాడకు ఎంత కిరాయి చెల్లించాలో నిర్ణయించాలని పట్టణానికి చెందిన తొండుల రాజు అర్జీని అందజేశారు.
- నూజివీడు పట్టణంలోని అమ్మవారితోట ప్రాంతంలో 8 మందికి చెందిన ద్విచక్ర వాహనాలను బైక్ దొంగలు ఎత్తుకెళ్లిపోయారని, బైక్ చోరీలు జరిగి 20 రోజులు గడిచినా ఇంత వరకు దొంగల ఆచూకీని పోలీసులు గుర్తించలేకపోయారని, న్యాయం చేయాలని అమ్మ వారితోటకు చెందిన పలువురు బాధితులు అర్జీని అందజేశారు.


అర్జీలను స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న

డ్రెయినేజీల్లో సిల్ట్ తొలగింపు

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): కొటికలపూడి గ్రామంలోని డ్రెయినేజీల్లో సిల్ట్ తొలగింపు పనులు సోమవారం చేపట్టారు. ఇటీవల కాలంలో డ్రెయిన్లలో సిల్ట్ పూడుకుపోయి మురుగునీటి పారుదలకు ఆటంకం ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో మురుగు నీరు రోడ్లపైకి చేరింది. స్థానికుల సమాచారంతో ఎంపీడీఓ శకుంతల సూచనలతో సర్పంచి రెంటపల్లి నాగరాజు డ్రెయిన్లలో సిల్ట్ తొలగింపు పనులు పారిశుద్ధ్య కార్మికులతో చేయించారు. తొలగించిన సిల్ట్‌ను బయట ప్రాంతానికి తరలిస్తామన్నారు.

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న

నూజివీడు: అనుమతి లేకుండా బాణసంచా దుకాణాలను నిర్వహించినా, విక్రయాలు జరిపినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న హెచ్చరించారు. దీపావళి నేపథ్యంలో బాణసంచా దుకాణాల ఏర్పాటు, టపాసుల రవాణా తదితర అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డివిజన్‌లోని పోలీసు, ఫైర్, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, ఆర్టీసీ అధికారులతో సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి జూమ్‌మీటింగ్ నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ దీపావళికి తాత్కాలిక బాణసంచా దుకాణాల ప్రదేశాలను పోలీసు, ఫైర్, రెవెన్యూ, విద్యుత్ అధికారులు సందర్శించి అభ్యంతరాలు లేకుంటేనే అనుమతివ్వాలన్నారు. డీఎస్పీ కేవీవీఎన్ వీ ప్రసాద్, సీఐ పీ సత్యశ్రీనివాస్, ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎ.సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజారాణి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



నూజివీడు: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నవంబర్ 3న నిర్వహించే సమ్మెకు సంబంధించిన సమ్మె నోటీసును సోమవారం పారిశుద్ధ్య కార్మికులు నూజివీడు మున్సిపల్ కమిషనర్ ఆర్ వెంకట రామిరెడ్డికి అందజేశారు. ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు మాట్లాడుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో సమ్మెను నిర్వహిస్తున్నామన్నారు. విధి నిర్వహణలో మరణించిన మున్సిపల్ కార్మికుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్మికుల ప్రస్తుతం ఉన్న బ్యాంకు ఖాతాలను యాక్సిస్ బ్యాంకులోకి మార్చుకోవాలని కమిషనర్లు చేస్తున్న ఒత్తిడిని వెంటనే ఆపాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నూజివీడు మున్సిపాలిటీ అధ్యక్షుడు ముత్యాల విజయ్, అల్లం కనకదుర్గ, పృథ్వీరాజ్, ముత్యాల సరస్వతి, తుపాకుల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.